ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో క్లారిటీ ఇవ్వాలి



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ రంగారావు

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నారో క్లారిటీ ఇవ్వాలని, అసలు ఆయనకైనా క్లారిటీ ఉందా? అని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సీఎం సమక్షంలో ఎమ్మెల్యే గాంధీ కప్పుకున్న కండువా పార్టీది కాదని, ఆలయానికి సంబంధించినది అని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ఎమ్మెల్యే మాటలు విని అసహించుకుంటున్నారన్నారు. పార్టీలు మారడం ఎమ్మెల్యేకు అలవాటుగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గాంధీ.. తాను పార్టీ కండువా కప్పుకోలేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మోతీనగర్‌లో నగర సంకీర్తన



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ శ్రీ శృంగేరి శారద శంకర మఠం ఆవరణలో బుధవారం శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మోతీనగర్ ప్రధాన వీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. ఈ మహోత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రతి రోజు వివిధ పూజా కార్యక్రమాలతో పాటు మేధావులు, విద్యావంతులతో ఉపన్యాసాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టరేట్‌లో వినాయక పూజలు



సాక్షి, సిటీబ్యూరో: కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో వినినాయ నిమజ్జనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎంతో ఆహ్లాదకరంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నిమజ్జనానికి సిద్ధం

- వివిధ చెరువుల వద్ద ఏర్పాట్లు చేసిన అధికారులు
- నిమజ్జన పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్
- మూడు షిఫ్టులుగా అధికారుల విధులు



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి సిద్ధం చేసిన క్రేన్



అంబీర్ చెరువు చెరువు వద్ద ..



బోయిన్‌చెరువు వద్ద ..

కూకట్‌పల్లి: తెలంగాణలోనే రెండవ వినాయక సాగర్‌గా రూపు దిద్దుకున్న కూకట్‌పల్లి రంగధాముని చెరువు వినాయక నిమజ్జనాలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 17వ తేదీన నిర్వహించే నిమజ్జన వేడుకలకు చెరువును అంగరంగ వైభవంగా తీర్చిదిద్దడమే కాకుండా అన్ని శాఖల సమన్వయంతో మూడవ రోజు నుంచే జరిగే నిమజ్జనాలకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మూడు షిఫ్టులుగా ఏర్పడి అన్ని శాఖల నుంచి దాదాపు 15 మంది విధులు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. జోన్ పరిధిలోని రంగధాముని (ఐడీఎల్) చెరువు, అంబీర్ (ప్రగతి నగర్) చెరువు, బోయిన్ చెరువులతో పాటు సున్నం చెరువు, మైసమ్మ చెరువు, ముళ్లకత్వ చెరువు, పరికి చెరువు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా నిమజ్జనాలకు ప్రసిద్ధి గాంచిన ఐడీఎల్ చెరువులో పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని వాహనాల రాకపోకలకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు అన్ని శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి రూట్ మ్యాప్‌లను తయారు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 300 విగ్రహాల వరకు నిమజ్జనం జరిగినట్లు తెలుస్తోంది.

- హైటెక్ సిటీ నుంచి ఐడీఎల్ చెరువు కట్ట మీదుగా కూకట్‌పల్లికి వెళ్లేవారు మూసాపేటకు వెళ్లి వై జంక్షన్ మీదుగా కూకట్‌పల్లి వైపునకు వెళ్లాలి. బాలానగర్, ఎర్రగడ్డ నుంచి ఐడీఎల్ చెరువు మీదుగా హైటెక్ సిటీకి వెళ్లే వాహనాలను కూకట్‌పల్లి నుంచి జేఎన్‌టీయూ మీదుగా హైటెక్ సిటీకి వెళ్లవచ్చు. నిమజ్జనాన్ని చూడటానికి వచ్చే భక్తుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. కైత్లాపూర్ మూసాపేట నుంచి వచ్చే వాహనాలు ఐడీఎల్ కంపెనీ వద్ద, హబీబ్ నగర్ వై జంక్షన్ నుంచి, బాలానగర్ నుంచి వచ్చే వాహనాలను ఆంజనేయనగర్ కాలనీ చివరన, ఖాళీ స్థలంలో, కేపీహెచ్‌బీ వివేకానందనగర్ కాలనీ నుంచి, కూకట్‌పల్లి నుంచి వచ్చే వాహనాలు కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

నిమజ్జనానికి వచ్చే వాహనాల రూట్ మ్యాప్

మూసాపేట నుంచి వచ్చే వాహనాలు ఐడీఎల్ కంపెనీ నుంచి నేరుగా చెరువు కట్ట మీదకు వస్తాయి. బాలానగర్ వై జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు చెరువు కట్ట మీదుగా వెళ్లి రంగనాయక స్వామి గుడి వద్ద యూటర్న్ తీసుకొని నిమజ్జనానికి వస్తాయి. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ నుంచి వచ్చే వాహనాలు మెట్రో ఎదురుగా యూటర్న్ తీసుకొని చెరువు కట్ట మీదుగా రంగనాథ స్వామి గుడి వద్ద యూటర్న్ తీసుకొని నిమజ్జనానికి వెళ్తాయి. నిమజ్జనం అనంతరం వాహనాలు అదే రూట్‌లో పోలీస్‌స్టేషన్ ఎదురుగా యూటర్న్ తీసుకొని బాలానగర్ మూసాపేట వెళ్లే వాహనాలు వెళ్తాయి. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి వాహనాలు నేరుగా వెళ్తాయి.

అంబీర్‌చెరువు వద్ద ఏర్పాట్లు

కూకట్‌పల్లిలో అతి పెద్ద చెరువైన అంబీర్ చెరువుపై అధికారులు నిమజ్జన ఏర్పాట్లు చేశారు. ఒకవైపు ప్రగతి నగర్ నుంచి, మరో వైపు నిజాంపేట నుంచి, ఇంకో వైపు భాగ్యనగర్ కాలనీ నుంచి హైదర్‌నగర్ నుంచి విగ్రహాలు రానున్నాయి. ఇందుకోసం ట్రాఫిక్ స్తంభించకుండా రూట్‌మ్యాప్‌ను ఏర్పాటు చేసి నిమజ్జనాలకు వచ్చే మార్గాలను ఎంపిక చేశారు. నిమజ్జనం జరిగిన తరువాత కూడా భక్తులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా వాహనాలను చెరువు వద్ద నుంచి వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలను సిద్ధం చేశారు. అదే విధంగా ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 2 క్రేన్స్, 2 టిప్పర్లు, హిటాచి వాహనం, జేసీబీ వాహనం, 10 మంది సిబ్బంది, క్రేన్ మెయింటెనెన్స్ సిబ్బంది 16 మంది అందుబాటులో ఉంటారు. వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారు.

బోయిన్‌చెరువు వద్ద...

చెరువు కట్టపై నిమజ్జనానికి ప్రస్తుతం 10 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, డీఐ రాజేంద్ర రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్ ఏఎస్‌ఐ మహేష్ విధులు నిర్వహిస్తున్నారు. నిమజ్జనం కొలనులో రెండు క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు పెద్ద విగ్రహాల నిమజ్జనానికి చెరువు గట్టుపై ఒక భారీ క్రేన్ ఏర్పాటు చేశారు. మరో క్రేన్‌ను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంజయ్యనగర్ చెరువు గట్టు మొదటి నుంచి చివరి వరకు వీధిలైట్లను ఏర్పాటు చేశారు. హెల్త్ సమస్యలు తలెత్తకుండా కంట్రోల్ రూమ్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందుబాటులోఉండనున్నారు.

భారీ బందోబస్తు.. నిరంతర పర్యవేక్షణ

కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుపై వినాయక నిమజ్జనాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏడు క్రేన్లు అందుబాటులో ఉన్నాయి. 65 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుంది. ప్రస్తుతం వివిధ జిల్లాల నుంచి 320 మంది పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. చివరి రోజు ఆర్ఏఎఫ్, సీఆర్‌పీఎఫ్ వంటి బలగాలు అందుబాటులో ఉంటాయని ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా డీసీపీ పర్యవేక్షణలో సుమారు 500 మంది భద్రత బలగాలు, మరో 50 మంది ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఐడీఎల్ చెరువు కట్టపైకి వాహనాలను పూర్తిగా నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు.

కొత్త రేషన్ కార్డులపై ఆశలు!

- 17 నుంచి జరిగే ప్రజాపాలనలో రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణపై చర్యలు
- సర్కారు సన్నద్ధతతో కొత్త రేషన్ కార్డుల మంజూరుపై లబ్ధిదారుల్లో ఆశలు



సాక్షి, సిటీబ్యూరో: కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి పది రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలనలో కార్డుల జారీకి సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆశలు మొదలయ్యాయి. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే 5.23 లక్షల రేషన్ కార్డులు ఉండగా, ఇందులో 17.17 లక్షల మంది సభ్యులు ఉన్నారు.కొత్త సభ్యుల పేర్లను కార్డుల్లో చేర్చడానికి జిల్లాలో 86,885 పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కొన్ని తహసీల్దార్ లాగిన్లలో, మరికొన్ని డీఎస్ఓ లాగిన్లలో ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనకు జిల్లా వ్యాప్తంగా పలు పథకాలు వర్తింపజేయాలని 7,24,271 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్‌కార్డులకు సంబంధించి 3.98 లక్షల దరఖాస్తులు చేసుకున్నారు.

కుటుంబాలు వేరు పడటంతో..

2014లో నిర్వహించిన కుటుంబ సమగ్ర సర్వే ఆధారంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఆహార భద్రత కార్డులు జారీ చేశారు. అయితే వినియోగదారులకు ఎలాంటి కార్డులు ఇవ్వకపోయినా... ఆహార భద్రత కార్డుల ప్రకారం బియ్యం పంపిణీ చేస్తున్నారు. పదేళ్లలో వేలాది కుటుంబాలు పలు కారణాలతో వేరుపడ్డాయి. వీరికి రేషన్ కార్డుల అవసరం ఏర్పడింది. చాలా కుటుంబాల్లోని కొత్త కోడళ్లు, పిల్లల వివరాలు కార్డుల్లో లేవు. వీరి పేర్లనూ కార్డుల్లో నమోదు చేయాల్సి ఉంది.

స్పష్టత రావాల్సిందే...

ప్రజాపాలనలో భాగంగా మొత్తానికి కార్డులు లేనివారికి ఇస్తారా? ప్రస్తుతం ఉన్నవారికి కొత్త కార్డులు జారీ చేస్తారా? కుటుంబ సభ్యుల పేర్లు చేర్చి వారికి కొత్తవి ఇస్తారా అనే విషయం తెలియాల్సి ఉంది. గతంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డులు ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేయవద్దని అధికారులు సూచించారు. ప్రస్తుతం నూతన రేషన్‌కార్డుల జారీ గురించి ప్రభుత్వం ప్రకటన చేయడంతో కొత్త సందేహాలు మొదలయ్యాయి. అయితే కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలకు అనుగుణంగా కొత్త రేషన్ కార్డులపై నిర్ణయం ఉండగలదంటున్నారు.

ప్రస్తుత రేషన్ కార్డుల వివరాలివీ..

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ దుకాణాలు: 619
- ఆహార భద్రత కార్డులు: 5,23,895
- కుటుంబ సభ్యుల (యూనిట్లు) సంఖ్య: 17,17,758
- నెల వారీగా పంపిణీ చేస్తున్న బియ్యం: 10,637.036 మెట్రిక్ టన్నులు

చిల్డ్రన్ ప్లే పార్కుగా సుందరీకరిస్తాం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ చౌరస్తా వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని పిల్లల పార్కుగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్‌లోని ఓపెన్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడానికి కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు సమ్మారెడ్డి, అంజయ్య యాదవ్, మహేష్, షకీల్ మున్నా తదితరులు పాల్గొన్నారు.



పార్కు ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ విడుదల



భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ విడుదల సందర్భంగా ఇంజినీర్లు, డీలర్లు

కూకట్‌పల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ తెలిపారు. శ్రీ సాయికృష్ణ స్టీల్ సిమెంట్ ట్రేడర్ డీలర్ షాపులో తాపీమేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, శ్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయ పడతారని తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద భీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు

వినాయక చవితి నవరాత్రి వేడుకలను మండప నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ పూజల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొని ఆ వినాయకుడి ఆశీస్సులు తీసుకుంటున్నారు. పలు మండపాల్లో అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)



కేపీహెచ్‌బీకాలనీ బస్టాప్ వద్ద సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వరరావు, శేరి సతీష్ రెడ్డి తదితరులు



మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో కళాకారుల నృత్య ప్రదర్శన



కేపీహెచ్‌బీ డివిజన్‌లో వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే కృష్ణారావు



వన్‌సిటీలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ..



అవంతి నగర్ తోట సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోని వినాయకుడి వద్ద..



వివేకానందనగర్, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



ఆంజనేయ నగర్ కాలనీ అసోసియేషన్ వినాయకుడి వద్ద ..



పీజేఆర్ నగర్ శివాలయం వద్ద పూజలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జేరిపేటి జైపాల్



గాయత్రినగర్ సంక్షేమ సంఘం ఉత్సవ కమిటీ గణనాథుని వద్ద నృత్య ప్రదర్శన

పనులు పూర్తి చేయాలని వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లేష్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్ ఇళ్ల మధ్యన నాలా విస్తరణ శ్లాబ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ సెల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాల క్రితం నాలా విస్తరణ పనులు చేపట్టారని, అవి సకాలంలో పూర్తి కాకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు ఇళ్లలోకి వర్షం నీటితో పాటు మురుగు నీరు ప్రవహిస్తుందన్నారు. దుర్గంధం వెదజల్లి అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందని వివరించారు.